ప్రజాశక్తి
బుధవారం 30 అక్టోబరు 2024
5
శ్రీకాకుళం

## ఉచిత వినికిడి పరికరాలకు నమోదు

**శ్రీకాకుళం అర్బన్ :** విజయవాడకు చెందిన దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్, నేషనల్ హెల్త్ మిషన్ సంయుక్తంగా ఉచిత వినికిడి పరికరాలను ఇచ్చేందుకు వీలుగా పేర్ల నమోదు ప్రక్రియను ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేపడుతున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. 21 ఏళ్ల లోపు వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి నవంబరు 8న ఉచితంగా వినికిడి యంత్రాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న వారు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఒపి నంబరు 27లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఉచిత వినికిడి పరికరాల పంపిణీ కోసం మెడికల్ క్యాంపు నిర్వహించే ప్రదేశానికి ధ్రువపత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ప్రభుత్వం జారీ చేసిన ప్యూర్ టోన్ ఆడియోమెట్రీ రిపోర్టు, సదరం సర్టిఫికెట్, డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తో హాజరు కావాలని సూచించారు.

# దుకాణం దక్కినా దు:ఖమే

- షాపుల కోసం రూ.లక్షల ఖర్చు చేసిన వ్యాపారులు
- అమ్మకాల్లో దక్కుతోంది పది శాతం మార్జినే
- లబోదిబోమంటున్న వ్యాపారులు
- ఇప్పటివరకు రూ.82.19 కోట్ల మేర అమ్మకాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మద్యం దుకాణాల లైసెన్స్ కోసం రూ.లక్షలు ఖర్చు పెట్టి దరఖాస్తులు వేశారు. లైసెన్స్ ఫీజు రూపంలో అంతకుమించి పెట్టుబడులు పెట్టారు. భారీగా లాభాలు వస్తాయని ఆశించారు. మరోవైపు మద్యం అమ్మకాలపై ప్రభుత్వం 20 శాతం వరకు మార్జిన్ ఇస్తుందని భావించినా పది శాతం ఇస్తుందని భావించారు. ప్రభుత్వం దాన్ని పది శాతానికే పరిమితం చేయడంతో, పెద్దగా లాభాలు రావడం లేదంటూ ఉసూరుమంటున్నారు. జిల్లాలో 158 మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్స్‌లను మంజూరు చేసింది. లైసెన్స్‌లు పొందిన వారంతా ఈనెల 16వ తేదీ నుంచి ఉత్సాహంగా దుకాణాలను ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉన్నా రోజువారీ ఆదాయం, ఖర్చు లెక్కలు చూస్తే వారికి సగం కూడా మిగలడం లేదని వాపోతున్నారు. కొత్త ప్రయివేట్ మద్యం పాలసీలో లైసెన్స్ ఫీజులు భారీగా నిర్ణయించారు. లైసెన్స్ ఫీజు చెల్లింపునకు నాలుగు కేటగిరీలు నిర్ణయించినా, జిల్లాకు సంబంధించి రూ.55 వేలు, రూ.65 వేలు వార్షిక ఫీజు కలిగిన దుకాణాలు మాత్రమే ఉన్నాయి. కొంతమంది సిండికేట్లుగా ఏర్పడి 40 నుంచి 50 దుకాణాల వరకు దరఖాస్తులు వేశారు. దరఖాస్తుల రూపంలోనే రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు చెల్లించారు. లైసెన్స్ ఫీజు కలుపుకుంటే రూ.1.50 కోట్ల మేర ఖర్చయింది.

### అమ్మకాల్లో పది శాతం మార్జినే...

మద్యం అమ్మకాలపై ప్రభుత్వం 20 శాతం మార్జిన్ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో వ్యాపారులు సంబరపడిపోయారు. ప్రస్తుతం వారికి దక్కుతున్న మార్జిన్ చూసి లబోదిబోమంటున్నారు. బేసిక్ ధర, ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్ స్పెషల్ మార్జిన్, హోల్‌సేల్ మార్జిన్ వంటి పన్నులు విధించిన తర్వాత వచ్చే ధరపై లెసెన్సీలకు 20 శాతం మార్జిన్ ఇస్తున్నారు. టాక్స్ రూపంలో వచ్చే సొమ్ము అంతా లైసెన్స్‌దారులకు కాకుండా నేరుగా ప్రభుత్వానికే వెళ్తోంది. దీంతో ప్రభుత్వం 20 శాతం మార్జిన్ ఇచ్చినా వ్యాపారులకు పది శాతమే దక్కుతోంది.

### మద్యం ధరలపై నిఘా

మద్యం అమ్మకాలపై మార్జిన్ చాలడం లేదని ధరలు పెంచుదామా అని ఆలోచిస్తున్న సిండికేట్లను ప్రభుత్వం గట్టిగా హెచ్చరించింది. బాటిల్‌పై ఎంఆర్‌పి కంటే అధిక ధరకు అమ్మితే చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. మొదటిసారి దొరికితే రూ.5 లక్షలు అపరాధ రుసుము విధించాలని ప్రభుత్వం సూచించింది. రెండోసారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేయాలని ఆదేశించింది. దీంతో ధరలు పెంచి అదనపు ఆదాయం ఆర్జించాలని చూసిన వ్యాపారులకు ప్రభుత్వ ఆదేశాలు మింగుడు పడడం లేదు.

### అమ్మకాల పెంపుపై దృష్టి

మద్యం అమ్మకాలపై మార్జిన్ తక్కువగా వస్తుండడంతో వ్యాపారులు అమ్మకాలను పెంచే పనిపై దృష్టిసారించారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేయడమే ఏకైక మార్గంగా ఎంచుకున్నారు. చాలాచోట్ల లైసెన్స్ కలిగిన మద్యం దుకాణాలు ఏర్పాటైన రెండు, మూడు రోజుల్లోనే బెల్టు షాపులూ ప్రారంభమయ్యాయి. తమ పరిధిలో ఉన్న షాపులకు మద్యం విరివిగా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

### రూ.82.19 కోట్ల మేర అమ్మకాలు

మద్యం దుకాణాలు ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. జిల్లావ్యాప్తంగా ఉన్న 158 దుకాణాల్లో రూ.82,19,46,428 మేర అమ్మకాలు జరిగాయి. వీటిలో ఐఎంఎల్ కేసులు 1,07,011, బీరు కేసులు 31,774 కేసుల మేర అమ్ముడుపోయాయి. ఈనెల 17వ తేదీన అత్యధికంగా రూ.10.66 కోట్ల మేర ఆదాయం సమకూరింది. మరుసటి రోజు రూ.10.22 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

భావనపాడులో హార్బర్ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

## భావనపాడులో కేంద్ర బృందం పర్యటన

### ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదిత ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్రతీరంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతంలో కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. హార్బర్ ప్రాంతంలో రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులతో కలిసి కేంద్ర ప్రభుత్వ తీర ప్రాంత ఇంజినీరింగ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ బెల్లియప్ప పర్యటించారు. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు సరిహద్దు నుంచి భావనపాడు జెట్టీ వరకు ఆయా ప్రాంతాలను సందర్శించారు. రేవులోతు, తీర ప్రాంత మ్యాపులను పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సముద్ర క్రీక్ వద్ద ఇసుక మేటలు వేయడంతో బోట్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మత్స్యకార ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన బెలియప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చేసేందుకు డిజైన్ రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ వద్ద తరచూ ఇసుక మేటలు వేయడం వల్ల చేపల వేట కార్యక్రమాలు నిలిచిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలతో కేంద్ర బృందం ఈ ప్రాంతంలో పర్యటించిందని తెలిపారు. ఈ మేరకు కేంద్ర బృందం స్థానిక అధికారులతో కలిసి బోట్ల ద్వారా కాలినడకన ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో భావనపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి, పలువురు టిడిపి, వైసిపి నాయకులు, మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు.

## సుందరయ్య స్ఫూర్తితో కొత్త రాజకీయ వ్యవస్థ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

వార్త... మెయిన్‌లో

అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

## సిఎం సభకు చురుగ్గా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని ఈదుపురంలో ఈనెల ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఇక్కడ్నుంచే ప్రారంభించనున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈదుపురంలో మంగళవారం పర్యటించారు. సభాస్థలి ప్రదేశాన్ని, గ్రామ పరిసరాలను పరిశీలించి పనులు చేపడుతున్న తీరును స్వయంగా పర్యవేక్షించారు. ప్రతిష్టాత్మకమైన ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచనలు చేశారు. సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి ముఖ్యమంత్రి మాట్లాడతారని చెప్పారు. ఆ రూట్ మ్యాప్, ఆయా ఇళ్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై ఆయన స్థానిక యంత్రాంగంతో మాట్లాడారు. కలెక్టర్‌తో పాటు ఆర్‌డిఒ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## ప్రమాదరహిత దీపావళి లక్ష్యం

### జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి జె.మోహనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రమాద, పర్యావరణ పరిరక్షణ రహిత దీపావళి తమ లక్ష్యమని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి జె.మోహనరావు అన్నారు. శ్రీకాకుళంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. దీపావళి సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు బాణసంచా కాల్చిన సమయంలో పెద్దలు పక్కనే ఉండాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 30 మండలాల పరిధిలో 94 బాణసంచా దుకాణాలకు తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనధికారికంగా మందుగుండు సామగ్రి విక్రయించే వారిపై పోలీస్‌శాఖతో కలిసి దాడులు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ కలిగిన బాణాసంచా మాత్రమే వినియోగించాలని, సరదా కోసం నిండు జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కాటన్ దుస్తులు ధరించి, నీటి నిల్వలు సిద్ధం చేసుకొని, బాణాసంచా కాల్చాలని సూచించారు.

## ఓటరు ముసాయిదా జాబితా విడుదల

- నవంబరు 28 వరకు సవరణలకు గడువు
- జనవరి 6న తుది ఓటర్ల జాబితా విడుదల
- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

జిల్లావ్యాప్తంగా ఓటర్ల జాబితా-2025 ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఏవైనా ఉంటే వాటిపై నవంబరు 28వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బిఎల్‌ఒలు ఇంటింటా సర్వే నిర్వహించారని చెప్పారు. మృతులు, వలస ఓటర్ల తొలగింపుతో పాటు 2025 జనవరి ఒకటో తేదీ నాటికి అర్హులైన వారి నుంచి కొత్తగా ఫారం-6 దరఖాస్తులు స్వీకరించినట్లు వివరించారు.

### అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు మంగళవారం నుంచి నవంబరు 28వ తేదీ వరకు గడువుగా ప్రకటించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ నవంబర్ 9, 10, 23, 24న ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణల నిమిత్తం దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు. డిసెంబర్ 24వ తేదీ వరకు వచ్చిన వాటిపై విచారించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. జనవరి 6న తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ ఏడాది మే 13న జరిగిన పోలింగ్ నాటికి జిల్లాలో మొత్తం 18,59,910 మంది ఓటర్లు కాగా, అందులో 9,22,442 పురుషులు, 9,37,329 మంది స్త్రీలు ఉన్నారని చెప్పారు. తాజాగా ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం ఆ సంఖ్య 18,77,426కి చేరిందని వివరించారు. ఇందులో16240 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని, మిగతా వారిలో పురుషులు 9,30479 కాగా, మహిళలు 9,46,817 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 16,338 మంది ఎక్కువగా ఉన్నారని వివరించారు. వీరితో పాటు ఇతరులు 130 మంది ఉన్నారన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2,358 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు.

### 23న ఉపాధ్యాయ ఎమ్మెల్సీఓటరు జాబితా

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా చేపట్టిన ఓటర్ల నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతుందని, వచ్చే నెల 23న ఓటర్ల ముసాయిదా విడుదల చేస్తామని తెలిపారు. ఈ ఓటర్ల జాబితాలో చేర్పులకు డిసెంబరు 8 చివరి తేదీ అని, ఈలోగా అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్యాన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

## రిమ్స్‌లో సౌకర్యాల కల్పనకు కృషి

- రోగులకు అసౌకర్యం లేకుండా చర్యలు
- ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిని మంగళవారం సందర్శించిన ఆయన విభాగాల వారీగా సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వసతుల కొరత ఉందని, అదనపు భవనాలు నిర్మించి ఈ కొరత తీర్చేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తానని తెలిపారు. మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నట్లు పలువురు తన దృష్టికి తెచ్చారన్నారు. ఆస్పత్రిలో సమస్యలతో పాటు వైద్యులు, సిబ్బంది కొరత ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యలను తీసుకెళ్లనున్నట్టు వివరించారు. ఐసియులలో ఎసిలు పనిచేయడం లేదన్నారు. తగినన్ని బెడ్లు లేని కారణంగా ఒకే బెడ్‌పై ఇద్దరికి వైద్యం చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు.

గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో ఆస్పత్రి అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేకపోయిందని చెప్పారు. ఈ సందర్భంగా రిమ్స్ ఆస్పత్రికి ఎమ్మెల్యే శంకర్ 20 సీలింగ్ ఫ్యాన్లు, స్టేడియం కోఆర్డినేటర్ లక్ష్మణరావు 25 సీలింగ్ ఫ్యాన్లు, అంధవరపు సంతోష్ వంద ట్యూబ్‌లైట్లు, ఆర్‌కె ఫ్రూట్స్ కష్ణ, గాంధీ 50 ట్యూబ్‌లైట్లు, పిఎన్ కాలనీకి చెందిన కె.శ్రీనివాసరావు పది వాల్ ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలం, ఆస్పత్రి సూపరింటెండెంట్ దాసరి షకీల, ఆర్ఎంఒ, పలు విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ధ్యేయం

### ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస, పొందూరు

ఆమదాలవలస : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని అక్కులపేట, శ్రీనివాసచార్యులపేటలో రూ.60.02 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రెయినేజీలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కులపేటను పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. పరిశ్రమల స్థాపన జరిగితే నిరుద్యోగాన్ని నిర్మూలించవచ్చని చెప్పారు. శ్రీకాకుళం - పార్వతీపురం రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈసర్లపేట వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో 60 ఎకరాల విస్తీర్ణంలో 400 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గతంలో తాను ప్రతిపాదనలు చేశానని గుర్తుచేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ ప్రతిపాదనను విస్మరించి ఆటకెక్కించిందన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి పరిశ్రమలను తీసుకొచ్చేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతి, బొడ్డేపల్లి వసుమతి, ఎంపిటిసిలు బొడ్డేపల్లి సుగుణ, తమ్మినేని బాలామణి, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు, నూక రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ చంద్రమౌళి, ఎపిఒ ఎస్.లక్ష్మీనరసమ్మ, కార్యదర్శి బగాది నాగరాజు పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం

కూటమి ప్రభుత్వంతోనే గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యపడుతుందని కూన రవికుమార్ అన్నారు. పొందూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి పాలనలో సచివాలయాలు, వాలంటీర్ల పేరుతో గ్రామాలను సర్వనాశనం చేశారని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వంలో వేసిన రోడ్లు తప్ప వైసిపి పాలనలో చేసిన అభివృద్ధి కనిపించలేదని ధ్వజమెత్తారు. సిసి రోడ్లు, కాలువల నిర్మాణం ద్వారా ఆరోగ్యవంతమైన గ్రామాలను నిర్మించవచ్చన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం మండలంలో ఎంఎస్ఎంఇలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు అవసరమన్నారు. చిలకపాలెం నుంచి రామభద్రపురం వరకు ఉన్న రాష్ట్ర రహదారిని జాతీయ రహదారులకు అప్పగించి నాలుగు లైన్ల రోడ్డుగా నిర్మించనున్నారని తెలిపారు. విజయవాడ వరద బాధితులకు యంగ్ స్టార్ యూత్ క్లబ్ ఆధ్వర్యాన గ్రామాల్లో సేకరించిన రూ.రెండు లక్షల చెక్కును క్లబ్ అధ్యక్షులు కె.శాంతారాం ఎమ్మెల్యేకు అందజేశారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు రామ్మోహన్, నాయకులు అన్నెపు రాము, సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

### జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు

ఏ కోర్సు చదివినా, అందులో నైపుణ్యత కలిగి ఉన్న వారికే ఉద్యోగావకాశాలు దక్కించుకోగలరని జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు అన్నారు. యువతకు అన్ని రంగాల్లో నైపుణ్యం పెంచడానికి శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. నైపుణ్య గణన జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆటోమేషన్, కృత్రిమ మేధ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషించనున్నాయన్నారు. అందువల్లే ప్రభుత్వం నైపుణ్య గణన చేపట్టి, వాటి ఆధారంగా యువతకు శిక్షణ ఇవ్వాలని భావిస్తోందన్నారు. గణన పారదర్శకంగా నిర్వహించి వివరాలను నైపుణ్య యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాస్థాయిలో శిక్షణ తీసుకున్న వారు మున్సిపాల్టీలు, గ్రామస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. నవంబరు మొదటి వారంలో నైపుణ్య గణనను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో రాగల మార్పులకు అనుగుణంగా యువత కూడా తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ ధర్మేంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. శిక్షణలో గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉదయ్, జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి రవీంద్ర, మాస్టర్ ట్రైనర్ ధర్మేంద్ర, ఎపిఎస్ఎస్‌డిసి సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళల్లో అక్షరాస్యత పెంచేందుకు 'ఉల్లాస్'

మహిళల అక్షరాస్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీధర్ రాజు తెలిపారు. జిల్లాస్థాయి ఉల్లాస్ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంపై ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. వయోజన విద్యాశాఖ డిడి ముద్దాడ వెంకటరమణ మాట్లాడుతూ అక్షరాస్యతలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు 'ఉల్లాస్' దోహదపడుతుందన్నారు. శిక్షణకు పొదుపు సంఘాల్లో మహిళలు, పాఠశాలల్లో పనిచేసే సహాయకులు, వంట పనివారు, ఆయాలు, అంగన్వాడీ కేంద్రాల సహాయకుల్లో నిరక్షరాస్యులను గుర్తించినట్లు చెప్పారు. వీరికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రతి పది మందికి ఓ సహాయకుడిని నియమిస్తారని తెలిపారు. ఫంక్షనల్, డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతపై అభ్యసన ఉంటుందన్నారు. డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, డిపిఒ, గ్రామ, వార్డు సచివాలయం, డిఐపిఆర్‌ఒ, విద్యాశాఖ అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, ఎపిఒ బాలచందర్ పాల్గొన్నారు.

కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

## ఓటర్ల నమోదు వేగవంతం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదు వేగవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్ తెలిపారు. కోటబొమ్మాళి ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ప్రాంతీయ సమావేశం మంగళశారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటబొమ్మాళి మండలం యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల అద్యక్షుడుగా పంగ సింహాచలం, సహాధ్యక్షులు రొక్కం నీలకంఠేశ్వరరావు, దుక్క కమలాభాయ్‌తో పాటు పలువురుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా సిపిఎస్ కన్వీనర్ గొండు నారాయణరావు, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి వాసుదేవరావు వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొంటి గిరిధర్, చౌదర్ రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి దాలయ్య, వైకుంఠరావు, ధర్మారావు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఎంఇఒ సంపదరావు అప్పలరాజు, ఉపాధ్యాయులు జి.వి.సోమేశ్వరరావు, సరస్వతి, హేమలత, దేవకి, నందన్‌రావులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

## జాతీయస్థాయిలో విజేతలుగా నిలవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు విజయాలను అందుకుని తిరిగి రావాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా కోరారు. ఇటీవల నంద్యాలలోని డిఎస్ఎ స్టేడియంలో నిర్వహించిన 68వ ఎస్‌జిఎఫ్ ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు ఎల్.డార్విన్, పి.ఆమనీలను మంగళవారం అభినందించారు. అండర్-17 విభాగంలో ఇప్పి ఇండివిడ్యువల్ ఈవెంట్‌లో కరకవలస జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన ఎల్.డార్విన్, అండర్-17 సాబర్ ఇండివిడ్యువల్ ఈవెంట్‌లో సతివాడ జెడ్‌పి హైస్కూల్‌కి చెందిన పి.ఆమనిలు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారు. వారికి శిక్షణ ఇచ్చిన ఎన్ఐసి ఫెన్సింగ్ కోచ్ వంశీని అభినందించారు. వచ్చే నెల 17 నుంచి జమ్మూకాశ్మీర్‌లో జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఈ 15న క్రీడాకారులు బయలు దేరి అక్కడకి వెళ్లనున్నారు. కార్యక్రమంలో పీడీలు భవానీ, డి.యశోద, అనితశ్రీ, పి.రాములమ్మ, రాహుల్ పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న రాజా

# శిథిల భవనాల్లో పశు వైద్య సేవలు

### భయాందోళనలో సిబ్బంది

ప్రజాశక్తి- పోలాకి

'ఏ ప్రభుత్వం వచ్చినా రాష్ట్రంలో పాడి సంపద అబివృద్ధి, పశు పోషణ ప్రధాన ధ్యేయం' అంటూ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేస్తుంటాయి. పాడి పరిశ్రమలు స్థాపించి పశు వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రసంగాలు గుప్పిస్తుంటారు. కానీ గ్రామస్థాయిలోని పశువైద్య కేంద్రాల పరిస్థితి చాలా దయనీయంగా ఉన్నాయి. కొన్ని కేంద్రాల్లో కనీసం మందులు కూడా దాచుకోలేని పరిస్థితి ఏర్పడింది. మండలంలోని పోలాకి, మబగాం, పిర్యాగ్రహారం, ఎస్.ఎల్.పురం, తలసముద్రం, జడూరు పంచాయతీల్లో పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. మండలం మొత్తం ఈ పశువైద్య కేంద్రాల పరిధిలో 2018 సంవత్సరం పశు గణన ప్రకారం సుమారు ఆవులు 13,522, గేదెలు 312, గొర్రెలు 23,500, మేకలు 9,510, కోళ్లు 37044 ఉన్నాయి. ఇవేకాక కొన్ని మూగ జీవాలకు వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. ఇన్ని మూగ జీవాలు ఉన్న ప్రాంతంలో పశువైద్య కేంద్రాలు భవనాల నిర్మాణాలకు ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. పోలాకి, తలసముద్రం,

శిథిలావస్థలో ఉన్న పోలాకి పశువైద్య కేంద్రం

పిర్యాగ్రహారం, మబగాం పశువైద్య కేంద్రాల భవనాలు మరీ అధ్వానంగా ఉన్నాయి. పైన పెచ్చులూడి వర్షలు పడితే మందులు కూడా తడిచిపోతున్నాయి. వైద్యులు ఉండి సేవలందించడానికి ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కేంద్రాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రతి కేంద్రంలోనూ వైద్యాధికారి డిప్యుటేషన్‌పై ఉన్నవారే. వాస్తవంగా ఒక కేంద్రంలో ఒక పశువైద్యాధికారి, సహాయికులు, ఆఫీస్ సబ్ ఆర్డినేట్ మొత్తం ముగ్గురు ఉండాలి. ఏ కేంద్రంలోనూ పూర్తిస్థాయిలో లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికీనా ప్రభుత్వం స్పందించి పశువైద్య కేంద్రాల భవనాల నిర్మాణాలకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

పెచ్చులూడిన శ్లాబ్

### నివేదిక పంపించాం

పశువైద్య కేంద్రాల శిథిలావస్థలో ఉండటం వాస్తవమే. అయితే భవనాల మరమ్మతులకు ఎస్టిమేట్స్ వేసి నివేదిక పంపించాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరైతే మరమ్మతులు చేపతాం.

**- రాజగోపాల్, పశుసంవర్థకశాఖ ఎడి**

### బయటకు వెళ్తే మూసివేతే..

మబగాం పశువైద్య కేంద్రం పరిధిలో మబగాం, కత్తిరివానిపేట, గజపతినగరం, మబగాం కాలనీ, ఖాన్‌సాహేబ్‌పేట తదితర గ్రామాలు ఉన్నాయి. ఇవన్నీ పశువైద్య కేంద్రానికి దూర గ్రామాలే. ఏదైనా పాడి పశువుకి వ్యాధి సోకి కేంద్రానికి తేలేని పరిస్థితిలో తానే వెళ్లాల్సి వస్తోంది. సిబ్బంది లేకపోవడంతో కేంద్రానికి తాళం వేసి వెళ్తున్నాను.

**- ఎం.మల్లేశ్వరరావు, పశువైద్యాధికారి, మబగాం**

### ఇరుకు గదుల్లోనే సేవలు

మండల కేంద్రం పోలాకిలోని పశు వైద్య కేంద్ర పరిధిలోని ఏడు పంచాయతీల నుంచి పాడి పశువులు తెస్తుంటారు. పరిధిలో ఎక్కువ. కానీ, ఉన్న భవనం చాలా చిన్నది. కనీసం మందులు దాచుకున్న బీరువాలు, పెట్టుకోవడానికి స్థలం లేదు. ఇరుక గదుల్లోనే ఇబ్బంది పడి విధులు నిర్వహిస్తున్నాం. మరుగుదొడ్ల సదుపాయం లేదు. మహిళా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**- ఎస్.అనిల్‌కుమార్, పశువైద్యాధికారి, పోలాకి**

## పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- పలాస

కార్తీకమాసంలో యాత్రికులు పంచరామ క్షేత్రాల దర్శనానికి పలాస ఆర్‌టిసి డిపో నుంచి ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బస్సు బయలుదేరుతుందని మేనేజర్ రోణంకి సీతారాం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అమరేశ్వరస్వామి, అమరావతి, సోమేశ్వరస్వామి, భీమవరం, క్షీర రామలింగేశ్వరస్వామి, పాలసకొల్లు, భీమేశ్వరస్వామి, ద్రాక్షారామం, కుమార రామ భీమేశ్వరస్వామి, సామర్లకోట శైవ క్షేత్రాలకు కార్తీకమాసంలో సోమవారం ముందుర ఆదివారం బయలుదేరుతుందన్నారు. దర్శనం అనంతరం మరలా మంగళవారం ఉదయం 8 గంటలకు పలాస కాంప్లెక్స్ వస్తుందని తెలిపారు. వచ్చే నెల 3, 10, 17 తేదీల్లో బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. సూపర్ లగ్జరీకి రూ.2,700, అల్ట్రా డీలక్స్ రూ.2,650, ఎక్స్‌ప్రెస్‌కు రూ.2,250 టిక్కెట్ ధర ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు డిపో మేనేజర్ 9959225610, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్ 7382924758 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

## పలాస ఆర్‌డిఒగా వెంకటేష్

**పలాస :** పలాస నూతన ఆర్‌డిఒగా గ్రంధి వెంకటేష్‌ను ప్రభుత్వం నియమించడంతో మంగళవారం భాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సుదర్శన్‌దొర అనారోగ్యానికి గురికావడంతో టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి ఇన్‌ఛార్జీ బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. దీంతో కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

## ఈశ్వరమ్మకు పరామర్శ

**శ్రీకాకుళం:** వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. గత కొంత కాలంగా ఆమె తీవ్ర అనారోగ్యంతో బాధపడతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలోని స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆమె నివాస గృహాన్ని సందర్శించి ఆర్యోగ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ఉన్నారు.

## బాణసంచా షాపుల తనిఖీ

**వజ్రపుకొత్తూరు:** మండలంలోని పూండి, బెండి గేటు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దీపావళి మందు గుండు సామగ్రి దుకాణాలను పలాస జిఎస్‌టి అధికారి కె.భార్గవ్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనల మేరకు విక్రయించిన సామగ్రికి జిఎస్‌టి చెల్లిస్తున్నది, లేనిది పరిశీలించారు.పూండిలో ఐదు షాపుల్లో బెండిగేటు, వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు.

పరిశీలిస్తున్న డిఎస్‌పి వివేకానంద

## వాటర్ ట్యాప్‌ల చోరీ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుర్తుతెలియని వ్యక్తులు వాటర్‌ట్యాప్‌ల చోరీకి పాల్పడ్డారు. కళాశాలలో ఇటీవల నాడు-నేడు పనుల్లో భాగంగా నూతనంగా బాలురు, బాలికలకు మరుగుదొడ్లను నిర్మించారు. ఈ మరుగుదొడ్లుకు గల తాళాలను పగలుకొట్టి అందులో గల వాష్‌బేషిన్లను పగలుకొట్టి పైపులకు ఉన్న వాటర్‌ట్యాప్‌లను చోరీ చేశారు. మొత్తం 19 వాటర్‌ట్యాప్‌లను చోరీ చేసినట్లు ప్రిన్సిపాల్ జె.సునీత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద కళాశాలలో మంగళవారం విచారణ చేపట్టారు. మరుగుదొడ్లలో చోరీ జరిగిన తీరును పరిశీలించి అధ్యాపకులను, విద్యార్థులను విచారించారు. కళాశాలలో నైట్‌వాచ్‌మెన్‌కు సంబంధించి ఉన్నదీ, లేనిది అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

## మహిళకు గాయాలు

**కోటబొమ్మాళి:** మండలంలోని వాంగ్రాడ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిమ్మాడ కూడలికి చెందిన జాగర్ల మీనాక్షి తీవ్రంగా గాయపడింది. మీనాక్షి నిమ్మాడ కూడలి నుంచి తన ద్విచక్రవాహనంపై నరసన్నపేట వెళ్తుంది. ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తన ద్విచక్రవాహనం నుజ్జునుజ్జు కాగా, ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మీనాక్షి నిమ్మాడ కూడలిలో పూజా సామగ్రి విక్రయిస్తూ... జీవనం సాగిస్తుందని స్థానికులు తెలిపారు.

## జూదరుల అరెస్టు

**పలాస :** పలాస బస్టాండ్ వద్ద ఉన్న ఖాళీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10,340 స్వాధీనం చేసుకున్నామని కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు తెలిపారు. కొద్ది రోజులుగా పేకాడ ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. పేకాట శిబిరాలపై తరచూ దాడులు నిర్వహిస్తామని అన్నారు.

## రెండు బైక్‌ల చోరీ

**పలాస :** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే కాలనీలోని రెండు బైక్‌లు చోరీకి సోమవారం రాత్రి గురయ్యాయని సిఐ మోహనరావు మంగళవారం తెలిపారు. సూదికొండ కాలనీలోని తన ఇంటి ముందు స్కూటీ పార్కు చేసి ఉండగా, గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని చల్లా సంతోష్ ఫిర్యాదు చేశారన్నారు. రైల్వే కాలనీలో తన ఇంటి ముందు పార్కు చేసి బుల్లెట్ వాహనం చోరీకి గురయ్యిందని యజమాని రాబిన్స్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదులపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎర్రగా మారిన వరి పంట

## పైరుపై గడ్డిమందు పిచికారీ

**మెళియాపుట్టి :** మండలంలోని జాడుపల్లిలో పండిన వరి పంటపై దుండగలు సోమవారం రాత్రి గడ్డిమందును పిచికారీ చేశారని బాధిత రైతు కలమట సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన 53 సెంట్లు ఎర్రగా తయారై పంట పోయిందని కన్నీటిపర్యంతమయ్యారు. దీనిపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

## ప్రశాంత్ కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని మామిడిపల్లికి చెందిన తెలుకల ప్రేమ్‌కుమార్ కుమారుడు తెలుకుల ప్రశాంత్ ఇటీవల ఇంటి పైకప్పు నుంచి జారిపడి తీవ్ర గాయాల పాలైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతడు జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వైద్య ఖర్చులు రూ.లక్షల్లో అవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సమాచారం తెలుసుకున్న మామిడిపల్లి టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (మెట) సభ్యులు మంగళవారం రూ.1,36,500 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. రైతు సంఘానికి రూ.70 వేలు, రోడ్డు అభివృద్ధికి, ఇరువైపులా మొక్కలు నాటేందుకు నిధులు అందజేశారు.

## ఆస్తులను కాపాడే బాధ్యత పోలీసులదే

ప్రజాశక్తి- పొందూరు

ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తులను కాపాడే బాధ్యత పోలీసులదేనని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక భాష్యం స్కూల్‌లో పోలీసుల విధులు, బాధ్యతలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలను కాపాడడంతో పాటు రహదారి ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, చట్టాలను అతిక్రమించే సమయంలోను, మహిళలపై అఘాయిత్యంకు పాల్పడేవారిపై పోలీసులు తీసుకునే చర్యలు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నీలిమ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

## రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్త దానం చేసిన వారు మరొకారి ప్రాణాన్ని రక్షించేవారవుతారని టెక్కలి అర్బన్ సిఐ అంబటి విజయకుమార్ అన్నారు. పోలీసులు అమరవీరుల వారోత్సవాలు భాగాంగ టెక్కలి దుర్గాభవాని కళ్యాణ మండపంలో మంగళవారం రక్తదానం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం అన్నది అన్నింటికన్నా మహాదానమని అన్నారు. ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు రక్త నిల్వలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని, దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని స్పష్టం చేశారు. జెమ్స్ ఆస్పత్రి మోనటరింగ్, మేనేజర్ బొడ్డ చిన్నారావు ఆధ్వర్యాన వైద్యులు అరుణ్,

పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అమర్, గౌతమి, భార్గవి, అప్పలకొండతో పాటు 28 మంది సిబ్బంది రోగులను పరీక్షించారు. శిబిరంలో బిపి, సుగగర్, కళ్లు, ఇసిజి, 2డి ఎకో, గుండె సంబంధిత వ్యాధులకు 250 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే 50 యూనిట్ల వరకు రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం రక్తదానం చేసినవారికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాము, నౌపడ ఎస్ఐ నారాయణస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి వివేకానంద

ప్రజాశక్తి- పొందూరు

దీపావళి సందర్భంగా అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసి మందుగుండు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద పేర్కొన్నారు. పొందూరు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనికీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాణసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. అలాగే బాణసంచా విక్రయాలకు అనుమతులను పొందినవారు తప్పనిసరిగా నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలను తీసుకొని మందుగుండు సామగ్రిని విక్రయించాలని పేర్కొన్నారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలో ఇప్పటివరకూ సుమారు 40 బాణసంచా దుకాణాలకు అనుమతులను మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం స్టేషన్‌లో పలు కేసులకు సంబందించిన రికార్డులను పరిశీలించారు. ఈయనతో పాటు ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

## డిఆర్‌ఒకు అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా రెవెన్యూ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మారెళ్ల వెంకటేశ్వరరావును జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో కలిసి దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రెవెన్యూ శాఖ పరిధిలోని ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు తదితర సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. డిఆర్‌ఒను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు

పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేణుగోపాలరావు

పి.వేణుగోపాలరావు, జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, ట్రెజరర్ మురళీధర్ నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.కె.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ రామలింగం, యూనిట్ అధ్యక్షులు ఎస్.కిరణ్‌కుమార్, కార్యదర్శి డి.ప్రకాశరావు పాల్గొన్నారు.

## కత్తెర పురుగు నివారణకు చర్యలు

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మొక్కజొన్న పంటలో కత్తెరపురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వడ్డాది శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మండలంలోని బండిపాలెంలో మొక్కజొన్న పంటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయోట్ 100 గ్రాములు, 500 ఎంఎల్ వేప నూనె పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని పాతర్లపల్లి, కొవ్వాడ గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యసాయ అధికారి డి.విజయభాస్కర్ మాటడుతూ వరి పంటలో రాజీలేని సూత్రాలు పాటించినట్లయితే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖధికారి అనూష, గ్రామస్తులు కొమర లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## అనధికార భవన నిర్మాణాలపై చర్యలు

### మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకొని వారిపై కేసులు నమోదు చేయాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆదేశించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడపడితే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు భవనాలు నిర్మాణం

మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

జరుగుతున్నాయని తెలిపారు. దీనివల్ల మున్సిపాలిటీకి ఆదాయం కొల్పోవడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. మున్సిపాలిటీలో జి ప్లస్ టూ అనుమతులు పొంది అనంతరం సుడా అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపడుతున్నారని, దీంతో టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ ఎన్.రామారావు సమాధానమిస్తూ... టౌన్ ప్లానింగ్ విధానం పూర్తిగా నిర్వీర్యమైందని తాము అంగీకరిస్తున్నామన్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత యాజమానులకు నోటీసులు ఇచ్చి కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ అక్రమ భవన నిర్మాణాలపై ఇప్పటికే 50 కేసులు నమోదు చేసి కోర్డు ద్వారా మున్సిపాలిటీకి రూ.50 లక్షల వరకు ఆదాయం తెచ్చుకున్నామని అన్నారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడితే తక్షణమే వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆన్లైన్ అనుమతులుపై కూడా సుడాకు వివరణ కోరుతున్నామన్నారు. కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, దుర్గా శంకర్ పండా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులను శుభం చేయాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, డిఇ కనకరాజు, టిపిఒ ఎన్.వరప్రసాద్, ఎఇ కిరణ్, కౌన్సిలర్లు డిక్కల ఆనంద్, గుజ్జు జోగారావు, శర్వాణి గీత, జోగ త్రివేణి, బెల్లాల శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చక్రధర్

## అప్పలరాజు ఊసరవల్లి

ప్రజాశక్తి- పలాస

రాజకీయ ఎదుగుదలకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నీచ రాజకీయాలకు తెరలేపుతున్నారని, ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని టిడిపి నాయకులు, 18వ వార్డు ఇన్‌ఛార్జి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు పైల చక్రధర్ అన్నారు. కాశీబుగ్గ తన స్వగృహంలో కూటమి నాయకులతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో అకారణంగా జరిగిన ఒక దుర్ఘటనని రాజకీయ లబ్ధికోసం వాడుకొని మమ్మల్ని బలిపసువు చేసి ఒక సామాజిక తరగతి ఓట్లను గుంజుకొని దొడ్డిదారి ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రస్తుతం గౌతు కుటుంబాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీషపై అనుచిత వ్యాఖ్యలు వింటుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయన్నారు. డ్యూటీలో ఉన్న ఒక పోలీసు ఉన్నతాధికారిని నానా దుర్భాషలతో పరుష పదజాలం ఉపయోగించారని గుర్తు చేశారు. బహిరంగ సభ టిడిపి కార్యకర్తలను ఈడ్చి కొట్టండని వైసిపి కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయలేదా? అని ప్రశ్నించారు. అప్పలరాజు శాంతిభద్రతలు, సంస్కారాలు, విలువలు కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో జనసేన, బిజెపి ప్రతినిధులు కేదారేనాథ్, వైశ్యరాజ రాజు, కార్య దర్శి గుంట ధర్మారావు, మార్కండేయ, పద్మశాలి సంఘం కార్యదర్శి ప్రభాకరరావు, లక్కోజు గిరి పాల్గొన్నారు.

## చేపల పెంపకంతో అదనపు ఆదాయం

### కెవికె కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

**ఆమదాలవలస :** విభిన్న జాతుల చేపల పెంపకంతో రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన వృత్తి విద్య శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రైతులకు శిక్షణ పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని రైతులు వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన పద్ధతులను అవలంబించడం, శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకోవడం ద్వారా ఆదాయ మార్గాలను పెంచుకోవాలని అన్నారు. శిక్షణలో భాగంగా చేపలకు తరచూ వచ్చే వ్యాధులపై

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భాగ్యలక్ష్మి, తదితరులు

అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం వస్తున్న నూతన విధానాలను అవలంభించడం ద్వారా సాగుఖర్చు తగ్గించుకోవడం, దిగుబడులను పెంచుకోవచ్చని మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.బాలకృష్ణ తెలిపారు. విశాఖపట్నం డైరెక్టర్ ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ చెరువుల్లో విభిన్న జాతుల పెంపకంపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కో-ఆర్డినేటర్ బాలాజీ, మత్స్యశాఖ సహాయ సంచాలకులు సంతోష్ పాల్గొన్నారు.

## అందుబాటులో బ్యాటరీ వాహనాలు

డికె మోటార్స్ ఎంటర్‌ప్రైజెస్ షోరూం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వాహనదారులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దూరం ప్రయాణించేందుకు నిత్యావసరంగా ఉన్న ద్విచక్ర వాహనాలను డికె గ్రూప్-డి కె-మోటార్స్ అండ్ డికె ఎంటర్ ప్రైజెస్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎలక్ట్రిక్ బ్యాటరీతో నడిపే ఈ వాహనాలను డికె గ్రూప్ బ్యాటరీ ఎలక్ట్రిక్ మొబిలిటీ, కెనటిక్‌గ్రీన్ ఎలక్ట్రిక్ కంపెనీకి అథరైజ్‌డ్ డీలరు. సంస్థ పరిధిలో రిజిస్ట్రేషన్, నాన్ రిజిస్ట్రేషన్ వాహనాలు విక్రయానికి అందుబాటులో ఉన్నాయి. తక్కువ ఖర్చుతో 60 నుంచి 130 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం గల వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఐపి 65 అండ్ ఐపి 67 రేటింగ్ మోటార్స్ అండ్ బాటరీస్‌తో విక్రయిస్తున్నారు. నాణ్యమైన సర్వీస్, స్పేర్స్‌తో సర్వీస్ అందించేందుకు అనువైన సర్వీసు సెంటరూ ఉంది. వినియోగదారుల సౌలభ్యం కోసం సర్వీస్ డోర్ స్టెప్ వరకు ఇవ్వనున్నారు. గత నాలుగేళ్లుగా 500పైగా వినియోగదారులకు సేవలందిస్తోంది. జిల్లాలో నిరంతరం ప్రతి మండల ప్రధాన కేంద్రంలో సర్వీస్ అందుబాటులో ఉంచిన ఏకైక సంస్థ డికె మోటార్స్ మాత్రమే. దీనికి అథరైజ్‌డు డీలరు నగరంలోని బలగలోని డికె మోటార్స్, డికె ఎంటర్ప్రైజెస్ మాత్రమే.

## సేవలకు సత్కారం

**కోటబొమ్మాళి:** ఉపాధ్యాయుడుగా క్రియాత్మక, వినూత్న రీతుల్లో పిల్లలకు బోధన చేస్తూనే తాను స్థాపించిన కెపి స్పందన ఫౌండేషన్ అనే సేవా సంస్థ, కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు షణ్ముఖరావు మాస్టర్‌కు యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి గొంటి గిరిధర్ మంగళవారం సన్మానించారు. సామాజిక స్పృహలను వందకు వంద శాతం అనుసరిస్తూ ఎంతోమంది ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సెక్రటరీ బమ్మిడి శ్రీరాములు, చౌదరి రవీంద్ర పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న ధనబాలాజీ

## క్రీడల్లో రాణించాలి

**ఎచ్చెర్ల :** విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.ధన బాలాజీ అన్నారు. 9వ రాష్ట్ర జూనియర్ ఇంటర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని మూడో స్థానం కైవసం చేసుకున్న పియుసి విద్యార్థిని వినూత్నను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. క్రీడల్లో రాణించి ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారని, వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాల అధిరోహించాలని హితవు పలికారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఫిజికల్ ఎడ్యుకేషన విభాగానికి చెందిన రాజు, టి.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

## ఐటిఐతో పెరుగుతున్న ఉద్యోగావకాశాలు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

యువతకు వృత్తివిద్య కోర్సుల్లో శిక్షణ నైపుణ్యంతో పాటు స్వయం ఉపాధి, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో ఉద్యోగాలు సాధించడానికి పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ)లు దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని భారతీ ఐటిఐ 40 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా చిట్టి నాగభూషణం ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్ది ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఐటిఐలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటుగా పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణను అందిస్తున్నారని అన్నారు. అందువల్లే ఇక్కడ చదువుకున్న వారిలో ఎక్కువమందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రస్తుతం పారిశ్రామిక రంగంలో ఐటిఐ విద్యార్థులకు అనేక కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఐటిఐ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు వృ విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో కళింగ కోమటి కార్పొరేషన్ పూర్వ అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, వైసిపి నాయకులు గురుగుబిల్లి లోకనాథం, టిడిపి నాయకులు మాదారపు వెంకటేష్, రెడ్డి శంకర్, మెండ దాసునాయుడు పాల్గొన్నారు.

## పంచాయతీల ద్వారానే 'ఉపాధి' పనులు

**ప్రజాశక్తి- రణస్థలం**

ఉపాధి హామీ ద్వారా మంజూరైన మెటీరియల్ కాంపొనెంట్ పనులను పంచాయతీల ద్వారానే చేపట్టాలని ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, సర్పంచ్‌లు కలెక్టర్, ఎంపిడిఒను ఒక ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీలకు సంబంధం లేకుండా, పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం సరైన పద్ధతి కాదని అన్నారు. పంచాయతీలు తీర్మానించిన టెండర్‌ను ఎంపిక చేయకుంటే న్యాయపరమైన సవాళ్లను అధికారులు ఎదుర్కొంటారని సూచించారు. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూటమి పార్టీల నాయకులకు అప్పగించడం చట్టవ్యతిరేకమన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం గ్రామాల్లో చేపట్టే పనులను సర్పంచ్‌లకే అప్పగించాలని స్పష్టం చేశారు. సర్పంచ్‌లకు కాకుండా కూటమి నాయకులకు గాని, కార్యకర్తలకు గాని అప్పజెప్పితే కోర్టులను ఆశ్రయిస్తామన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ రామారావు

## సైబర్ నేరాలపై అప్రమత్తం

**ప్రజాశక్తి- పాతపట్నం**

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిఐ వి.రామారావు సూచించారు. మండలంలోని తెంబూరు కూడలి వద్ద దుకాణాల యజమానులకు, ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే మీ మొబైల్ నంబరు ఒటిపిని చెప్పకుండా ఉండాలన్నారు. అలాంటి ఫోన్ కాల్స్ ఏమైనా వస్తే వెంటనే పాతపట్నం పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు. అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ దరించాలన్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలన్నీ ఉంచుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. బాణసంచా కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే బాణసంచా దుకాణాలను పరిశీలించారు.

# భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

**ప్రజాశక్తి- పోలాకి**

రైతులు భూ హక్కులను పరిరక్షణ కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కొల్లివలసలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. గతంలో భూమి ఎవరు పేరు మీద ఉందో తెలియని దుస్థితి నెలకొందని అన్నారు. వాటిని సరిచేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో తప్పుగా నమోదైన వాటిని సరి చేసేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, భైరి భాస్కరరావు, సూరపు నారాయణదాసు, లుకలాపు రాంబాబు, మురళి పాల్గొన్నారు.

పోలాకి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

**మెళియాపుట్టి :** రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బడే పాపారావు సూచించారు. మండలంలోని పూలసార, బురద రామచంద్రపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ మేరకు 20కి పైగా దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, సర్వేయర్ డిటి వెంకటరావు పాల్గొన్నారు.

**కోటబొమ్మాళి:** స్థానిక ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు పార్కు వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరావు, మండల అధ్యక్షులు బోయిన రమేష్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్‌లు టిడిపి సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, కర్రి అప్పారావు, దేవాది సింహాద్రమ్మ పాల్గొన్నారు.

**లావేరు :** రెవెన్యూ సదస్సుల ద్వారా రీ సర్వే భూ సమస్యలు పరిష్కారించుకోవాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. మండలంలోని ఇజ్జడాపాళెం, భరణికాం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో 76 వినతులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి ఎన్.తిరుపతిరావు, సర్వేయరు బి.శ్రీధర్‌రెడ్డి, విఆర్‌ఒ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విస్తృతంగా టిడిపి సభ్యత్వ నమోదు

సభ్యత్వ నమోదు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

**ప్రజాశక్తి- పోలాకి**

తెలుగుదేశం పార్టీతోనే తెలుగు జాతికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని దీర్ఘాశిలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపిని మరింత బలోపేతం చేస్తూ ఎన్‌టిఆర్ ఆశయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్తారని అన్నారు. ఏ ఒక్క రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమానికి రూ.కోట్లు ఖర్చు చేసిన ఘనత టిడిపికే దక్కుతుందని అన్నారు. దీపావళి పండగ నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు మహిళలకు ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భైరి భాస్కరరావు, సూరపు నారాయణదాసు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత**

జలుమూరు మండలం లింగాన్నాయుడుపేటకు చెందిన ధర్మాన భానుప్రసాద్ అనారోగ్యం బారిన పడ్డాడు. సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో రూ.1,77,637 విడుదలైంది. ఈ సందర్భంగా మండలంలోని మబగాంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం లబ్ధిదారునికి చెక్కును అందజేశారు.

## రొమ్ము కేన్సర్‌పై అవగాహన

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

ప్రారంభ దశలో రొమ్ము కేన్సర్ గుర్తిస్తే చికిత్స సులభతరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ దుంగ హర్యవల్లి అన్నారు. నగరంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఐఎంఎ మహిళా విభాగం సయ్యుక్తంగా రొమ్ము కేన్సర్‌పై మంగళవారం అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో కేన్సర్‌ను గుర్తిస్తే చికిత్స చేయటం ఎంతో సులభతరం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేన్సర్ నియంత్రణకు చర్యలు తీసుకుంటుందన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పిఎం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కేన్సర్‌కు ఉచితంగా చికిత్స అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్వజనాస్పత్రి వైద్యాధికారులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేస్తున్న పద్మజీ

## ఎయిర్‌ఫోర్స్‌కు 'సూర్యతేజ' విద్యార్థి ఎంపిక

**పలాస :** కాశీబుగ్గ సూర్యతేజ కళాశాలలో చదివిన జి.సాయి సుమన్ ఇటీవల విడుదలైన ఎయిర్ ఫోర్స్ పరీక్షల్లో అర్హత సాధించారు. ఎయిర్ ఫోర్స్‌లో పైలెట్ ఉద్యోగం సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ దానేటి పద్మజీ కామేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం నుంచే అనేక పోటీ పరీక్షలకు కళాశాలలో నిర్వహించిన తరగతులను సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. అలాగే డిగ్రీలోనూ మంచి మార్కులు సాధించాడని తెలిపారు. ఈ విజయం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి కలిగిస్తుందని అన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

## ఐఆర్ ప్రకటించాలి

**టెక్కలి :** ఉపాధ్యాయులు ఎందుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన డిఎ ఎరియర్స్, ఐఆర్‌ను ప్రకటించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండలంలోని లింగాలవలస, రావివలస, టెక్కలి బాలికోన్నత పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యారంగం నాశనమైందన్నారు. ఎపిటిఎఫ్ నాయకులు ఎస్.వి.ఆనిల్‌కుమార్, బొడ్డేపల్లి నేతాజీ, ధనుంజయరెడ్డి, శ్రీనివాసరావు, పేడాడ వాణిశ్రీ, మోహనరావు పాల్గొన్నారు.

## నేడు ప్రజావేదిక

**వజ్రపుకొత్తూరు:** ఈ నెల 30న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వెలుగు కార్యాలయం ఆవరణలో ప్రజా వేదిక నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై 15 రోజులుగా గ్రామస్థాయిలో సామాజిక తనిఖీలు చేపట్టామని చెప్పారు. దీనిపై నిర్వహించనున్న ప్రజావేదికకు అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది సకాలంలో హాజరుకావాలన్నారు.

## నేడు సాయిబాబా సంస్మరణ సభ

**టెక్కలి :** ప్రొఫెసర్ కామ్రేడ్ జి.ఎన్ సాయిబాబా సంస్మరణ సభ ఈ నెల 30న విజయవాడ ప్రెస్‌క్లబ్ భవనంలో నిర్వహిస్తున్నామని, ఈ సభకు ప్రజాస్వామ్య వాదులు తరలిరావాలని కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2009లో కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై ప్రకటించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొవాలన్నారు.

పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

## ప్రజాస్వామ్యంపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి- నందిగాం**

విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన అవసరమని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు అన్నారు. ఈ మేరకు ఆరో తరగతి విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులే నాయకులుగా, ఓటర్లుగా, ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా, ఓట్ల లెక్కింపు అధికారులుగా, పోలింగ్ నిర్వహణ వంటి వాటిపై విద్యార్థులతో కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పించారు. దేశ్ ఆపన్ సహయోగ్ ఫౌండేషన్ పేరుతో విద్యాశాఖ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బెందాళం రత్నం తెలిపారు. అనంతరం విద్యార్థులే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంకిడి రామారావు, తులసీప్రసాద్, ఎన్.గోవిందరాజు, దుంపల సంధ్యారాణి పాల్గొన్నారు.

## టూ టౌన్ సిఐగా ఈశ్వరరావు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

విశాఖ రేంజ్ పరిధిలో మరో మారు సిఐలను బదిలీ చేశారు. ఈమేరకు డిఐజి నుంచి ఉత్తర్వులు వచ్చాయి. బదిలీ అయిన వారిలో టూటౌన్ సిఐ జి.ఉమామహేశ్వరరావు ఉన్నారు. ఆయనను విశాఖ నగరానికి బదిలీ చేస్తూ విఆర్‌కు పంపించారు. ఆయన స్థానంలో విఆర్‌లో ఉన్న పి.ఈశ్వరరావును శ్రీకాకుళం టూటౌన్ సిఐగా నియమించారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

## 108 మందికి వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనోవికాస కేంద్రంలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ, వికలాంగుల శాఖలు సంయుక్తంగా మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు ప్రారంభించారు. 108 మంది ఈ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బి.సాయిరాం, వికలాంగులశాఖ ఎడి కె.కవిటి, న్యాయవాది జి.ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు.

## న్యాయం చేయాలి

**ప్రజాశక్తి- పలాస**

మండలంలోని రెంటికోటకు చెందిన గొర్రెలకాపరి బొమ్మాళి రామయ్య కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర బిసిసెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ కోరారు. రామయ్యకు చెందిన 45 గొర్రెలు, మేకలను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం దొంగిలించారని, దీంతో ఆయనకు రూ.5 లక్షల వరకు నష్టం వాలిట్టిందని అన్నారు. విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం రామయ్యను పరామర్శించారు. దీనిపైనే ఆధారపడి ఆయన కుటుంబం బతుకుతోందన్నారు. ఈయన వెంట శ్రీకృష్ణ యాదవ సంఘం నాయకులు దడియాల నర్సింహులు, కిక్కర బాలకృష్ణ. వంకల కూర్మారావు, బి.రాజు, భగీరథ, బద్రి గోపాల్, జీడి కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాశక్తి- పాతపట్నం**

మండలంలోని తెంబూరు పంచాయతీ సర్పంచ్ బెనియా వెంకటరమణ తల్లి కమలమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం వెంకటరమణను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే గణపురానికి చెందిన మామిడి కగేశ్వరరావు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈమెతో పాటు ఎంపిపి కుమారుడు దొర పార్వతీశం, వైస్ ఎంపిపి సవిరిగాన ప్రదీప్, జిల్లా ఆదివాసీల సంఘ అధ్యక్షులు అప్పన్న, కోదూరు సర్పంచ్ మోహన్ పాల్గొన్నారు.

నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ రంజిత్

## నిబంధనలు తప్పనిసరి

**ప్రజాశక్తి- పోలాకి**

బాణాసంచా సామగ్రి విక్రయించే దుకాణా దారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ జి.రంజిత్ ఆదేశించారు. మండలంలోని బెలమర, పోలాకి, ఈదులవలస కూడళ్లలో ఏర్పాటు చేసిన బాణాసంచా షాపులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలుదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు, అగ్నిమాపక శకటం తప్పనిసరిగా ఉంచాలన్నారు.

## కొనసాగుతున్న దీక్షలు

**కవిటి:** తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 308వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం దీక్షలో పాల్గొన్న తిప్పనపుట్టుగ గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ బిడ్డల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోహన్ పుష్ప సాహు, ఖగపతి దళై, దుదిష్టి మజ్జి, కుమార్ సాహు, లలిత్ మజ్జి, ధర్మ సాహు, సాగర్ మజ్జి, పురుషోత్తం మజ్జి, రాము బెంగ, దయానిధి బిసాయి తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

**పలాస :** పలాస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని రైల్వే అభివృద్ధి సలహా కమిటీ సభ్యులు కోరారు. రైల్వే స్టేషన్ ఆవరణలో మంగళవారం అభివృద్ధి కమిటీ సలహా సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. భువనేశ్వర్ నుంచి పూణే, రామేశ్వరం వెళ్లే రైలుకు పలాసలో హాల్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. కోణార్క్, ఫలకనామ, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు స్త్రీలకు ఐదు నిమిషాల హార్డ్ సౌకర్యం పెంచాలని కోరారు. ఖుర్దా డివిజన్‌లోని పలాసను వాల్తేర్ డివిజన్‌లోకి మార్చాలని, సీనియర్ సిటిజెన్లకు రాయితీ పునరుద్ధరించాలని కోరారు. రైల్వే స్టేషన్‌లో మరుగుదొడ్ల పరిశుభ్రత పెంచేవిధంగా చర్యలు చేపట్టాలని, రైళ్లు రావడానికి పావుగంట ముందుగా అనౌన్స్‌మెంట్ చేయాలని విన్నవించారు. సమావేశంలో కమిటీ సభ్యులు బి.రేవతి, ఎం.విశ్వేశ్వరరావు, పి.వి.సతీష్, వై.సంతోష్ కుమార్, పి.లోకనాథం, ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఆర్.సి.నాయక్, స్టేషన్ మేనేజర్ ఎస్.కె.దాస్, సిబిఎస్ ఎన్.వి.ఎల్.మూర్తి, ఐ.ఎస్.బాబు పాల్గొన్నారు.

# పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు

**ప్రజాశక్తి- పలాస**

ఉద్యానవన వంటల్లో భాగంగా జీడి, కొబ్బరి, పనస తదితర పరిశ్రమలు ఏర్పాటుకు రాయితీలు కల్పిస్తామని ఎపిఎపిఎన్ జిల్లా అధికారి ఆర్.శ్రీనివాసరావు అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఉద్యానవనశాఖ అసిస్టెంటతో, జీడి వ్యాపారులతో జీడి పప్పు శుద్ధి పరిశ్రమలు, ఆహార ప్రొసెసింగ్ పరిశ్రమలపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎఫ్‌ఎంఇ పథకం కింద 35 శాతం, నాబార్డు నిధుల కింద, 33 శాతం రాయితీతో పాటు తీసుకున్న రుణాలపై మూడు శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. నూతన పరిశ్రమలతో పాటు పాత పరిశ్రమలకు మిషనరీ కొనుగోలు చేసేందుకూ పథకాల ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. ఉద్యానవనశాఖ ఆధ్వర్యాన నూతన పరిశ్రమలకు మాత్రమే 40 శాతం రుణాలు మంజూరు చేశామని చెప్పారు. నాబార్డు డిప్యూటీ మేనేజర్ రమేష్‌కృష్ణ, ఉద్యానవనశాఖ అధికారులు శంకరన్, సునీత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

# మల్టీపర్పస్ సెంటర్‌కు స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ ఇఇ రమాదేవి

**ప్రజాశక్తి- మెళియాపుట్టి**

సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన మల్టీపర్పస్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఇఇ రమాదేవి తెలిపారు. ఈ మేరకు మండలంలోని పాతర్లలోవలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. అక్కడ స్థల సౌకర్యం కొరవడడంతో సవరసీడిపాలెం వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. పిఎం జన్మన్ గ్రాంట్ కింద రూ.60 లక్షలతో ఈ భవన నిర్మాణం చేపట్టనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. అలాగే మెళియాపుట్టి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవనాలను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఇ సిమ్మన్న, ఎఇ శ్రీకాంత్, కాంట్రాక్టర్ కార్తీక్ పాల్గొన్నారు.

కవిటి : అవగాహన కల్పిస్తున్న ఎఒ దుర్గాప్రసాద్

# సస్యరక్షణపై అవగాహన

**ప్రజాశక్తి- పోలాకి**

వ్యవసాయ రంగంలో సాగు చేసినప్పుడు రైతులకు సస్యరక్షణ, క్రిమి సంహారక మందులు వాడటంపై అవగాహన ఉండాలని మండల ఎఒ చిరంజీవి సూచించారు. మండలంలోని ఉరజాంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

**కవిటి:** ప్రస్తుతం వరి చేలో దోమపోటు కనిపిస్తోందని, దీని ప్రభావంతో పంటచేలు మొదట్లో పసుపుగా మారి, చేని గుండ్రని సుడులు తిరిగిపోతుందని ఎఒ బదగల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని బట్టివానిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దోమపోటు నివారణకు దోమ తీవ్రతను బట్టి పైమిట్రోజెన్, డైనోఫ్యూరిన్ కలిపి ఎకరానికి 130 గ్రాములు చల్లుకోవాలన్నారు. అలాగే రెండో పంటకు అనుకూలమైన నువ్వులు, రాగులు విత్తనాలు సబ్సిడీ ద్వారా అందిస్తామని రైతులు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు బెందాళం కళ్యాణ్, పశు సహాయకులు నీలవేణి పాల్గొన్నారు.

**నందిగాం :** ఖరీఫ్ సీజన్లో రైతులు సన్న రకాల్లో ఆశించే చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలని మండల ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ సూచించారు. మండలంలోని వెజ్‌పల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రసాయని ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రీ ఎరువుల ద్వారా సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు సింహాద్రినాయుడు, పి.మహేష్, టి.సీతారాం పాల్గొన్నారు.

**జి.సిగడాం :** మండలంలోని మదుపాంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన టిడిపి సభ్యత్వ నమోదులో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కె.రవికుమార్, నిద్దాం సర్పంచ్ మీసాల రవి పాల్గొన్నారు.

**పాతపట్నం :** మండలంలోని గుంగువాడ, చిన్నమల్లిపురం గ్రామాల్లో మండల ఎఒ శారద పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సుడిదోమ, పొడ తెగులు, అగ్గి తెగులు నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, రైతులు రామయ్య, గంగాధర్, ప్రసాద్, బాబూరావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

## జోషికుమార్‌కు ఆర్థికసాయం

**ప్రజాశక్తి- సంతబొమ్మాళి**

స్థానికంగా ఉన్న కెపి స్పందన ఫౌండేషన్ తూర్పుగోదావరికి చెందిన ఇజ్జన జోషి కుమార్‌కు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న జోషి తన తండ్రిని కోల్పోయి తల్లి దర్జీ పనితో జీవనం కొనసాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న కెపి స్పందన ఫౌండేషన్ చదువు నిమిత్తం ఆర్థికంగా ఆదుకుంది. ఇందులో భాగంగా మంగళవారం సంస్థ అధ్యక్షులు షణ్ముఖరావు మాస్టారు రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. కోర్సు పూర్తయ్యేంతవరకు నెలకు సరిపడా భత్యం సమకూరుస్తున్నట్లు దుంప చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో సింహాచలం, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

## ప్రాచీన వైద్యంగా ఆయుర్వేదానికి గుర్తింపు

ధన్వంతరి చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న జగదీష్

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

ప్రపంచంలో అతి ప్రాచీన వైద్యం ఆయుర్వేదమని, దీర్ఘ కాలిక వ్యాధులను సైతం సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా నయం చేసేందుకు ఆయుర్వేదం ఉపకరిస్తుందని ఆయుష్ విభాగం వైద్యాధికారి పి.జగదీష్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో తొమ్మిదో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద మూలపురుషుడైన భగవాన్ ధన్వంతరీ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి బలివాడ మల్లేశ్వరరావు, ఆయుష్ కాంపౌండర్ జాడ చంద్రశేఖరరావు, వాకర్సు గవర్నర్ కొంక్యాన మురళీధర్, యోగా మాస్టర్లు మురళి, గాయత్రి పాల్గొన్నారు.

**కోటబొమ్మాళి:** మండలంలోని ధనత్రయోదశిని పురస్కరించుకొని మంగళవారం నాయీబ్రాహ్మణులు ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో నాయీబ్రాహ్మణ జిల్లా ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు ఆధ్వర్యాన ధన్వంతరి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వార్డు మాజీ సభ్యులు నౌగాపు సుశీల, చిగురువలస రాజేశ్వరి, లక్ష్మి, కనకరాజు, శోభారాణి, హరీష్, పోతల అప్పారావు, వెంకటేష్, శారద పాల్గొన్నారు.

## వీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

**కోటబొమ్మాళి:** పోలీస్ అమరవీరుల త్యాగాలు దేశంలో ఉండే ప్రతి పౌరుడూ స్ఫూర్తిదాయకం కావాలని వంశధార విద్యా సంస్థల వ్యవస్థాపకులు చింతాడ అనిరుధ్రుడు అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కోటబొమ్మాళి వంశధార విద్యాసంస్థల ప్రాంగణంలో ఎస్ఐ వి.సత్యనారాయణ అధ్యక్షతన అమరవీరుల సంస్కరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతనం ప్రజల ప్రాణాల రక్షణ ధ్యేయంగా తమ ప్రాణాలను పోగొట్టుకున్న అమర వీరులను స్మరించుకోవడం దేశంలో గల ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌సి ఎ.విశ్వేశ్వరరావు, పిసి సి.హెచ్.దుర్గారావు, ప్రిన్సిపాల్ డి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లు సరిచేయరూ...

**ప్రజాశక్తి- సరుబుజ్జిలి**

మండలంలోని రొట్టవలస రజక వీధిలో ఉన్న మంతెన రాము ఇంటిపై ప్రమాదకర స్థితిలో వేలాడుతున్న విద్యుత్ వైర్లను మార్చమంటే విద్యుత్‌శాఖ లైన్‌మెన్ లంచం డిమాండ్ చేస్తున్నాడని మాజీ ఎంపిటిసి తొత్తడి వెంకటరమణ ఆరోపించారు. ఇదే విషయమై జిల్లా ఉన్నతాధికారులు కూడా ఫిర్యాదు చేస్తానని తెలిపారు. విద్యుత్ వైర్లు ఇంటిపై వేలాడుతున్నాయని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి సంబంధిత లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.